జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీల్లో వెండి పతకం

మహిమ

సారంగాపూర్, ఫిబ్రవరి 27: హర్యానా రాష్ట్రంలో ఇటీవల నిర్వహించిన 37వ జాతీయస్థాయి జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో రాష్ట్రం తరపున పాల్గొన్న రూరల్ మండలంలోని సారంగాపూర్ జడ్పీ హైస్కూల్‌కు చెందిన బగ్గలి మహిమ ప్రతిభ చాటి సిల్వర్ మెడల్ సాధించింది. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న మహిమ నెట్ బాల్ క్రీడలో ఆసక్తిని చూపించింది. దీంతో పీఈటీ కృష్ణంరాజు స్కూల్ ఆవరణలో నెట్‌బాల్ క్రీడా పోటీల్లో మరింతగా రాణించడానికి అనుసరించాల్సిన పద్ధతులపై శిక్షణనిచ్చారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపి జిల్లాకు పేరు ప్రతిష్టలు తేవడం గర్వకారణమని ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ధర్పల్లి, ఫిబ్రవరి 27: మండల కేంద్రంలోని పెద్ద చెరువులో గురువారం ఉదయం గుర్తు తెలియని మగ వ్యక్తి మృతదేహం గుర్తించినట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వ్యక్తి శవం చెరువులో తేలియాడుతున్నదని స్థానికులు సమాచారం అందించారు. దీంతో మృతదేహాన్ని చెరువులో నుంచి బయటికి తీయించి పరిశీలించారు. మృతదేహంపై తెలుపు రంగు నల్ల కలర్ గీతల చొక్కా, వైట్ కలర్ ప్యాంటు ఉన్నది. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి, గుర్తు పట్టనట్లుగా మారింది. ఎవరైనా గుర్తిస్తే ధర్పల్లి ఎస్సై 8712659856, సీఐ 8712659855 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించామని పేర్కొన్నారు.

త్రీ టౌన్ ఏరియా మరొకటి..

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 27: నగరంలోని త్రీ టౌన్ ఏరియా పరిధిలో ఉన్న పంబోలి ప్రాంతంలో సుమారు 40-45 ఏండ్ల మధ్య వయస్సు ఉన్న మృతదేహాన్ని గుర్తించినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. గురువారం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు తమకు సమాచారం అందించారని పేర్కొన్నారు. రెండు రోజుల క్రితం మృతిచెంది ఉంటాడని, మృతదేహం ఒంటిపై బూడిద రంగు షర్టు, బూడిద రంగు ప్యాంటు ఉన్నదని తెలిపారు. వివరాలు తెలిసిన వారు మూడో టౌన్‌లో లేదా 8712659839, 8712659717 నంబర్లలో సమాచారం ఇవ్వాలని ఎస్సై సూచించారు.

3నుంచి సౌందర్యలహరి పారాయణం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 27: లోక కల్యాణార్థం మార్చి3వ తేదీ నుంచి నగరంలోని ఆర్యవైశ్య సంఘం భవనంలో శ్రీ సుందర వాసవి మహిళా భక్త బృందం, వాసవి కన్యకా పరమేశ్వరీ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో సౌందర్యలహరి పారాయణం నిర్వహించన్నుట్లు మహిళా మండలి పట్టణ అధ్యక్షురాలు దొంతుల ధనలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నగరవాసి మహారాష్ట్రలో గుర్తింపు

వినాయక్‌నగర్, ఫిబ్రవరి 27: నగరంలోని మాలపల్లి ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తిని మహారాష్ట్రలో గురువారం గుర్తించినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి ఒక ప్రకటనలో తెలిపారు. మాలపల్లికి చెందిన ఖమ్రోద్దీన్ మతిస్థిమితం లేక ఇటీవల ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అతడు మహారాష్ట్రలోని సేలు పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో తిరుగుతుండగా.. పోలీసులు గుర్తించి నిజామాబాద్ వన్‌టౌన్‌కు సమాచారం అందించారు. అతడి కుటుంబ సభ్యుల వివరాలు తెలిసిన వారు వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో లేదా 8712659837నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌హెచ్‌వో సూచించారు.

మహిళా పోలీస్ కబడ్డీ రాష్ట్ర జట్టుకు బట్టాపూర్ వాసి ఎంపిక

గోదావరి

మోర్తాడ్, ఫిబ్రవరి 27: రాష్ట్రస్థాయి మహిళా పోలీస్ కబడ్డీ జట్టుకు ఏర్గట్ల మండలం బట్టాపూర్ గ్రామానికి చెందిన మూడ్‌గంగారాం, లక్ష్మిల కూతురు గోదావరి ఎంపికైంది. మార్చి 2 నుంచి 6 వరకు పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి కబడ్డీపోటీల్లో పాల్గొంటున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు లింగయ్య, కార్యదర్శి గంగాధర్, కోచ్ మీసాల ప్రశాంత్ తెలిపారు. జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు రాష్ట్రజట్టులో చోటు సంపాదించుకోవడంతో పోలీస్ అధికారులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు గోదావరిని అభినందిస్తున్నారు.

జాతీయ సదస్సుకు సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రతినిధులు

శక్కర్‌నగర్,ఫిబ్రవరి27:ఆర్ఎస్ఎస్,బీజేపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం న్యూఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ సదస్సుకు గురువారం సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రతినిధులు తరలివెళ్లారు. న్యూఢిల్లీ వెళ్లిన వారిలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర కమిటీ కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ప్రభాకర్, రాష్ట్ర నాయకుడు రామకృష్ణ, ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి బి.దేవారాం, సహాయ కార్యదర్శి ఆర్.రమేశ్, జిల్లా నాయకులు బండారి మల్లేశ్, గుమ్ముల గంగాధర్, సురేశ్, వి.సత్తెవ్వ, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేందర్, పీవోడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వి. గోదావరి, పీవోడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు బి. నాగమణి, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ అనీస్, బాబన్న, అరవింద్ ఉన్నారు.

నవీపేటలో బైక్ చోరీ

నవీపేట, ఫిబ్రవరి 27: మండల కేంద్రంలో ఓ పత్రిక విలేకరికి చెందిన బైక్ బుధవారం రాత్రి చోరీకి గురైందని ఎస్సై వినయ్ గురువారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండల కేంద్రంలో సరస్వతీ నగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్న ఓ దినపత్రిక విలేకరి ఇంటి పక్కన షెడ్డులో తన బైక్‌ను బుధవారం రాత్రి పార్క్ చేశాడు. ఇద్దరు దుండగులు బైక్ హ్యాండిల్ లాక్‌ను ధ్వంసం చేసి కొద్ది దూరం వరకు తోసుకుంటూ వెళ్లి సమీపంలో ఉన్న చర్చి వద్ద డూప్లికేట్ కీతో స్టార్ట్ చేసుకొని వెళ్లారు. ఇంటి యజమాని ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో చోరీ దృశ్యాలు రికార్డయ్యాయి. ఈ మేరకు బాధిత విలేకరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
CHANGE OF NAME
I, AFROZ KHAN S/o SHARE KHAN R/o.H.No.10-13-144/298/10, Drivers Colony ,Nizamabad ,Dist., T.S. Changed My New name as MOHAMMED AFROZ KHAN S/o SHARE KHAN
NTZ-338522
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

- ఓటు హక్కును వినియోగించుకున్న పట్టభద్రులు, ఉపాధ్యాయులు
- పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఇతర అధికారులు

బోధన్‌లో ఓటువేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు

నవీపేటలో ఓటు వేసిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రాంకిషన్‌రావు, నాయకులు

ఓటు వేసిన జడ్పీ మాజీ చైర్మన్ విఠల్‌రావు, విశాలినిరెడ్డి

మాదాపూర్‌లో క్యూలైన్‌లో నిలబడిన గ్రాడ్యుయేట్ ఓటర్లు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఫిబ్రవరి 27: జిల్లా వ్యాప్తంగా గురువారం నిర్వహించిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికల కోసం జిల్లాలో 81 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. పోలింగ్ కేంద్రాలను కలెక్టర్, సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఇతర అధికారులు తనిఖీ చేశారు. పోలింగ్ సరళిని పరిశీలించారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ కొనసాగింది. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలో పోలింగ్ స్టేషన్ నంబర్ 122లో ఓటుహక్కు వినియోగించుకున్నారు. అనంతరం మాక్లూర్ మండలం మాదాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ ఇతర అధికారులతో కలిసి వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య ప్రత్యేక వాహనాల్లో కరీంనగర్ రిసెప్షన్ సెంటర్‌కు తరలించారు.

రుద్రూర్, వర్ని మండలాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ తారాబాయి, ఏసీపీ శ్రీనివాస్ పరిశీలించారు. రుద్రూర్‌లో మొత్తం 353 పట్టభద్రుల ఓట్లకు 291మంది, 49మంది ఉపాధ్యాయులకు 39 మంది, వర్నిలో 370మంది పట్టభద్రులకు 318మంది, 41మది టీచర్లకు 39మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. చందూర్‌లో 206మంది గ్రాడ్యుయేట్ ఓట్లకు గాను 84.65శాతం మంది ఓటు వేయగా.. మోస్రాలో 204మందికి గాను 165మంది ఓటు వేశారు. పోలింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ వికాస్ మహాతో, చందూర్ తహసీల్దార్ శాంత సందర్శించారు. పొతంగల్ మండలంలో 257మంది పట్టభద్రులు ఉండగా 211మంది, 12 మంది టీచర్లకు గాను 12 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. డిచ్‌పల్లిలో 821మంది పట్టభద్రులకు 683 మంది ఓటు వేయగా.. 41 మంది టీచర్లకు 40 ఓటు వేశారు. పోలింగ్ సమయం ముగిసిన అనంతరం వచ్చిన చిటికెల నర్సారెడ్డి అనే పట్టభద్రుడిని అధికారులు వెనక్కి పంపించారు. నిజామాబాద్ ఆర్డీవో నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్ ఎన్నికల సరళిని పరిశీలించగా.. సీఐ మల్లేశ్, ఎస్సై షరీఫ్ బందోబస్తు నిర్వహించారు. ధర్పల్లిలో 468మంది పట్టభద్రులకు 399మంది, 31మంది టీచర్లకు 26మంది ఓటు వేశారని తహసీల్దార్ మాలతి తెలిపారు. ఐదు గురు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారన్నారు. ఇందల్వాయి మండలంలో 339మందికి 282మంది పట్టభద్రులు, 15మంది టీచర్లకు 14మంది ఓటు వేశారు. తిర్మన్‌పల్లిలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీవో రాజేంద్రకుమార్ సందర్శించారు. జక్రాన్‌పల్లిలో 64మంది ఉపాధ్యాయులకు 61మంది, 839మంది పట్టభద్రులకు 628మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని మండల ఎన్నికల అధికారిణి, తహసీల్దార్ కిరణ్మయి తెలిపారు. సిరికొండలో 25 మంది ఉపాధ్యాయులకు వందశాతం, 715మంది పట్టభద్రులకు 556మంది.. 70శాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. కమ్మర్‌పల్లి మండలంలో గ్రాడ్యుయేట్ ఓట్లు మొత్తం 1021 కాగా 771 ఓట్లు(75.51శాతం) పోలయ్యాయి. టీచర్ ఓట్లు 61 ఉండగా 56 ఓట్లు(91.8శాతం) పోలయ్యాయి. మోర్తాడ్ మండలంలో గ్రాడ్యుయేట్ ఓట్లు 671 కాగా 549ఓట్లు(81.81శాతం) పోలయ్యాయి. టీచర్ ఓట్లు 63కాగా 61ఓట్లు(96.82శాతం) పోలయ్యాయి. ఏర్గట్ల మండలంలో గ్రాడ్యుయేట్ ఓట్లు 304 కాగా 249ఓట్లు(81.90శాతం)పోలవ్వగా, టీచర్ ఓట్లు 17 కాగా 15ఓట్లు(88.23శాతం) పోలయ్యాయి. భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ కమ్మర్‌పల్లి, ఏర్గట్ల, మోర్తాడ్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

ఓటు హక్కును వినియోగించుకుంటున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

మోర్తాడ్‌లో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న గ్రాడ్యుయేట్లు

మాక్లూర్ మండలంలోని మాదాపూర్‌లో పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. మండలంలో పట్టభద్రులు 789 మందికి గానూ 382 మంది పురుషులు, 247 మంది స్త్రీలు ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 79 మంది గానూ 50 మంది పురుషులు, 26మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. వేల్పూర్‌లో మండల కేంద్రంలో డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎడపల్లి మండల పరిధిలో 88 శాతం పోలింగ్ నమోదైందని తహసీల్దార్ కె.దన్వాల్ తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 501, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 44 మంది ఓటు వేశారని తెలిపారు. ఆర్మూర్ పట్టణంలోని పెర్కిట్ జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోలింగ్ కేంద్రం వద్ద ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గ్రాడ్యుయేటడ్ ఓటర్లు 3708 మంది ఉండగా 2807 ఓట్లు పోలైనట్లు ఆర్డీవో రాజాగౌడ్ తెలిపారు. 70 శాతం ఓట్లు పోలైనట్లు తెలిపారు. టీచర్లు 456 ఉండగా 425 ఓట్లు పోలైనట్లు తెలిపారు. 75 శాతం ఓట్లు పోలైనట్లు తెలిపారు. సాలూర లో పోలింగ్ కేంద్రం వద్ద బోధన్ రూరల్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. 4 గంటల వరకు పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అధికారులు అనుమతి ఇచ్చారు. నవీపేట మండలంలో 810 మంది పట్టభద్రులకు 635 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారని తహసీల్దార్ వెంకటరమణ పేర్కొన్నారు. 64 మంది ఉపాధ్యాయులకు 59 మంది ఓటు వేశారని తెలిపారు. నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై వినయ్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. తన సొంత మండలమైన నవీపేటలో బీఆర్ఎస్ నాయకులు తోటి మిత్రులు కే.సాయిబాబాగౌడ్, భవంతి దేవిదాస్‌తో కలిసి బీఆర్ఎస్ నాయకుడు ఆర్. రాంకిషన్‌రావు ఓటు హక్కును వినియోగించున్నారు. బాల్కొండ మండలంలో ఓటర్లు 626కు గాను 489 మంది ఓట్లు వేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. మెండోరలో పట్టభద్రులు 388 మందికి గాను 299 మంది ఓట్లు వేశారు. ఉపాధ్యాయులు 38 మందికి గాను 33 మంది ఓటు వేశారు. భీమ్‌గల్‌లో పోలింగ్ కేంద్రం వద్ద అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై మహేశ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ముప్కాల్‌లో పట్టభద్రులు 513 మందికి 418, ఉపాధ్యాయులు 52 మందికి 52 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు.

బోధన్ డివిజన్‌లో భారీగా పోలింగ్

బోధన్ డివిజన్‌లోని బోధన్ పట్టణం, 11 మండలాల్లో టీచర్స్, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ స్థానాలకు భారీగా పోలింగ్ జరిగింది. టీచర్స్ ఎమ్మెల్సీకి 94.15 శాతం పోలింగ్, గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీకి 81.5 శాతం పోలింగ్ నమోదైంది. బోధన్ డివిజన్‌లో టీచర్స్ ఎమ్మెల్సీకి 701 ఓటర్లు ఉండగా, అందులో 660 మంది, పట్టభద్రుల ఎమ్మెల్సీకి 5,037 మంది ఉండగా 4,106 మంది ఓట్లు వేశారు. బోధన్ పట్టణంలో టీచర్స్ ఎమ్మెల్సీకి ఒక పోలింగ్ కేంద్రం, పట్టభద్రుల ఎమ్మెల్సీకి రెండు పోలింగ్ కేంద్రాలను పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేశారు. పట్టణంలోని గ్రాడ్యుయేట్స్‌కు చెందిన 132 పోలింగ్ కేంద్రంలో 1168 ఓట్లు ఉండగా, 885 ఓట్లు పోలయ్యాయి. గ్రాడ్యుయేట్స్‌కు చెందిన 133 పోలింగ్ కేంద్రంలో 894 మంది ఓటర్లు ఉండగా, 706 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. టీచర్స్ ఎమ్మెల్సీకి సంబంధించిన 445 మంది ఓట్లు ఉండగా, 417 మంది ఓట్లు వేశారు. బోధన్ పట్టణంలోని గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో సందర్శించారు. పోలింగ్ సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పోలింగ్ సిబ్బందికి సూచించారు. అంతకుముందు ఈ పోలింగ్ కేంద్రాలకు బోధన్ ఏసీపీ శ్రీనివాస్ వచ్చి పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చందూర్‌లో ఓటు వేసేందుకు వరుసలో నిల్చున్న ఓటర్లు

నవీపేటలో..

జన్నెపల్లిలో కుస్తీ పోటీలో మల్లయోధులు

చిక్కడ్‌పల్లి గ్రామంలో..

అలరించిన కుస్తీ పోటీలు

నవీపేట, ఫిబ్రవరి 27: మండలంలోని జన్నెపల్లి శివాలయ ఆవరణలో గురవారం మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామ అభివృద్ధి కమిటీ అధ్వర్యంలో కుస్తీ పోటీలు నిర్వహించారు. పలు గ్రామాల నుంచి వచ్చిన కుస్తీ వీరులు పోటీలో తలపడ్డారు. మొదటి కుస్తీ రూ. 50తో ప్రారంభమై చివరి కుస్తీ రూ.3,000 వరకు సాగింది. ఈ పోటీలో 75 మంది కుస్తీ వీరులు పాల్గొన్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. చివరి కుస్తీ పోటీలో మహారాష్ట్ర లోని నాందేడ్ జిల్లా బెల్లూర్‌కు చెందిన గంగాధర్ విజేతగా నిలిచినట్లు తెలిపారు. పోటీలను తిలకించేందుకు మహారాష్ట్రతో పాటు జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన ప్రజలు తరలివచ్చారు. విజేతలకు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు నగదును అందజేశారు. అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై వినయ్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

చిక్కడ్‌పల్లి గ్రామంలో

రుద్రూర్, ఫిబ్రవరి 27: మండలంలోని చిక్కడ్‌పల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన కుస్తీ పోటీలు ఆకట్టుకున్నాయి. జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి మల్లయోధులు తరలివచ్చి పోటీలో తలపడ్డారు. చివరి కుస్తీలో విజేతకు రూ.వేయి నగదు అందజేశారు.


విజేతకు నగదును అందజేస్తున్న గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు

చురుకుగ్గా మాటు కాలువ నిర్మాణ పనులు

- బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరు

వేల్పూర్‌లో చురుకుగా కొనసాగుతున్న కాలువ నిర్మాణ పనులు

వేల్పూర్, ఫిబ్రవరి 27: మండల కేంద్రంలో మరుసుకుంట అలుగు నీరు పంట పొలాలకు వెళ్లేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.20లక్షలు నిధులు మంజూరు చేయడంతో మాటుకాలువ నిర్మాణ పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. గతేడాది విస్తారంగా వర్షాలు కురిశాయి. వర్షపు నీరు రోడ్లపై నిలవడంతోపాటు ఇండ్లలోకి వెళ్లడంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి, ప్రస్తుత బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి ఈ ప్రాంత ప్రజలు విన్నవించారు. స్పందించిన ఆయన మాటు కాలువ నుంచి నీరు పంట పొలాలకు వెళ్లేందుకు కాలువ నిర్మించాలని నిర్ణయించి రూ.35 లక్షలు నిధులు మంజూరు చేయించారు. ఆ తర్వాత అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పనులు ప్రారంభంలో జ్యాప్యం ఏర్పడింది. ఎమ్మెల్యే స్పందించి అధికారులను ఆదేశించడంతో వారం రోజుల నుంచి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. కాలువ నిర్మాణ పనులు పూర్తయితే మాటు కాలువ ద్వారా వర్షపు నీరు గ్రామంలోని రోడ్లపైకి కాకుండా పంట పొలాలకు వెళ్తుందని గ్రామస్తులు అంటున్నారు. తాము అడిగిన వెంటనే కాలువ పనులకు నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

- భర్త, ఆయన కుటుంబీకులు కలిసి చంపారని మృతురాలి తండ్రి ఫిర్యాదు

శక్కర్‌నగర్, ఫిబ్రవరి 27: బోధన్ పట్టణంలోని ద్యాకంగల్లీకి చెందిన జమేదార్ రజిత (34) అనే వివాహిత గురువారం తెల్లవారు జామున హైదరాబాద్‌లోని గాంధీ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందింది. బోధన్ పోలీసుల కథనం ప్రకారం.. ద్యాకంగల్లీకి చెందిన జమేదార్ సాయిలుకు రెంజల్ మండలంలోని బాగేపల్లి గ్రామానికి చెందిన రజితతో వివాహం అయ్యింది. వారికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈనెల 24న మధ్యాహ్నం రజితకు నిప్పంటుకున్నట్లు గమనించిన స్థానికులు, ఆమెను పోలీసుల సహకారంతో బోధన్‌లోని జిల్లా దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. రజితపై ఆమె భర్త సాయిలు పెట్రోల్‌పోసి నిప్పంటించి చంపాడని, తన కుమార్తె మృతికి భర్తతో పాటు ఆయన కుటుంబీకులే కారణమని మృతురాలి తండ్రి మీసాల సాయిలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. హైదరాబాద్‌లోని దవాఖానలో బోధన్ ఎస్సై హబీబ్‌ఖాన్ శవపంచనామా చేసి, మృతురాలి తండ్రి నుంచి ఫిర్యాదు స్వీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ఎడపల్లి, ఫిబ్రవరి 27: ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి మండల కేంద్రంలోని చెరువులో పడి గురువారం మృతి చెందినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. సాలూర గ్రామానికి చెందిన మంగళి రమేశ్(35) ఎడపల్లి గ్రామంలో ఓ వ్యక్తి వద్ద పశువుల కాపరిగా పని చేస్తున్నాడు. గేదెలను చెరువులో శుభ్రం చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతి చెందాడు. మృతుడి తండ్రి లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మోర్తాడ్, ఫిబ్రవరి27: కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని మినీ స్టేడి యం వద్ద పేకాడుతున్నరన్న సమాచారం మేరకు గురువారం పోలీసులు దాడులు నిర్వహించారు. పేకాడుతున్న ముగ్గురిని పట్టుకున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. వీరి నుంచి రూ. 2580 స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవీపేట,ఫిబ్రవరి 27: రెంజల్ మండలం బాగేపల్లి 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం 10 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ జి.ప్రశాంత్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నవీపేట మండలంలోని కమలాపూర్, రాంపూర్, కోస్లీలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.